## క్లుప్తంగా

### ఎల్‌ఓసీ మంజూరు



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**ములకలపల్లి:** మండలపరిధిలోని వేముకుంట గ్రామానికి చెందిన బాణోతు నాగేంద్రకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ 75 వేల రూపాయలకు ఎల్‌ఓసీ మంజూరు చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న నాగేంద్రను, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం పరామర్శించి, ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

### ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరుటౌన్:** మండలంలోని పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం పరామర్శించారు. రామానుజవరం గ్రామానికి చెందిన అక్కి గురవయ్య కూతురు దేశబోయిన స్వరూప మృతి చెందాన పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా పీవీకాలనీకి చెందిన చావ భారతి ఇటీవల మృతి చెందగా, సోమవారం దశదిన కర్మలు నిర్వహించగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించి భారతి చిత్రపటానికి నివాళులర్పించారు.

### నిత్యావసరాలు పంపిణీ

**మణుగూరుటౌన్:** మండలంలోని నిరుపేద కుటుంబాలకు రూ.5 వేల విలువైన మణుగూరు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. చిట్టూరు శేషుబాబు-మణి వివాహ వార్షికోత్సవం సందర్భంగా, వందనపు నీలిమ జన్మదినోత్సవం సందర్భంగా రాజుపేటకు చెందిన ఇరు కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కేసా రాజేంద్ర ప్రసాద్, బొగ్గవరపు అంజలి, బండారు నర్సింహారావు, వసుంధర, శ్యాం, కత్తిరాము తదితరులు ఉన్నారు.

### లక్ష్మీకాలనీలో వైద్య శిబిరం

**చర్లరూరల్:** చర్ల మండలంలో వైరల్, డెంగీ జ్వరాలు మళ్ళీ విజృంభిస్తున్న నేపథ్యంలో కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీధర్ ఆదేశానుసారం డాక్టర్ పూజ ఆధ్వర్యంలో లక్ష్మీకాలనీలోని డబుల్ బెడ్‌రూం ప్రాంతంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 62 మందికి వైద్య పరీక్షలు చేయగా.. ముగ్గురికి జ్వరాలు ఉండడంతో వారికి వైద్యం అందించి కావలసిన మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆశా కార్యకర్తలు ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు, నరసింహారావు, స్వరూప, రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### మావోయిస్టుల సమాచారం అందించండి

**ములకలపల్లి:** మావోయిస్టుల సమాచారం అందించి, పోలీసులకు సహకరించాలని ఎస్సై రాజమౌళి పిలుపునిచ్చారు. అజ్ఞాత జీవితం గడుపుతున్న మావోల వివరాల కూడిన పోస్టర్లను పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మండలపరిధిలోని పలుగ్రామాల్లో, మారుమూల ఆవాసాల్లో అంటించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఏజెన్సీలో అభివృద్ధికి మావోయిస్టులు అడ్డుపడుతున్నారని అన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు తగిన రివార్డు అందజేస్తామన్నారు.

### హరీశ్‌రావు జన్మదిన వేడుకలు

**దమ్మపేట:** బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలను, దమ్మపేట బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతులమీదుగా కేకు కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు ఒకరికొకరు కేకు తినిపించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి దొడ్డా రమేష్, రావుల శ్రీను, గాజుబోయిన యేసు, పాకనాటి శ్రీను, బలుసు గోపి, ఊయ్యాల చిన్నవెంకటేశ్వరరావు, పసుమర్తి వీరేశ్వరరావు, అబ్దుల్ జిన్నా, బుడే, రావూరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు గ్రేడింగ్‌తో ఉపాధి

- నీడ పట్టున సాగుతున్న పనులు
- రోజువారీ కూలితో సంతృప్తి
- ఆసక్తి చూపుతున్న స్థానికులు



పొగాకు గ్రేడింగ్ పనులు చేస్తున్న కూలీలు

**అశ్వారావుపేటరూరల్:** అధిక ఎండల నేపథ్యంలో కూలీలు పనులు చేసేందుకు అవస్థలు పడుతుండగా.. వర్జీనియా పొగాకు గ్రేడింగ్ పనులు మాత్రం నీడ చాటున ఉపాధి కల్పిస్తోంది. చల్లని తాటియాకుల పందిర్ల కింద గ్రేడింగ్ పనులు చేసేలా రైతులు ఏర్పాట్లు చేయడంతో, ఈ పనులు చేసేందుకు కూలీలు ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రతి ఏడాదీ అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాల్లో వర్జీనియా పొగాకుతోపాటు నాటు పొగాకు పంటను కుడా రైతులు సాగు చేస్తుంటారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోనే అత్యధికంగా ఈ పంటను రైతులు సాగు చేస్తుంటారు. ఈ రెండు మండలాల్లో సుమారు నాలుగు వేల ఎకరాల్లో పంట సాగులో ఉండగా, 630 వరకు పొగాకు క్యూరింగ్ చేసేందుకు బ్యారన్లు ఉన్నాయి. ఈ పొగాకు పంట సాగు చేసిన కొద్ది నెలల్లో ఆకు కోతలు ప్రారంభిస్తారు. ఈ ఆకు కోతలకు ఏపీలోని వివిధ ప్రాంతాలను రైతులు తీసుకొస్తుంటారు. వలస కూలీల ముఠాలు వచ్చి ఈ పనుల్లో నిమగ్నం అవుతారు. కాగా ఆకు కోతలు ముగిసిన తర్వాత కూలీలు ఆకులను గ్రేడింగ్ చేసి వాటిని కట్టలుగా కట్టిన తర్వాత బ్యారన్‌లో ఊడికించే పనులు చేపట్టుతారు. ఈ పనులు గడిచిన కొద్ది నెలలుగా సాగుతున్నాయి.

**ముమ్మరంగా గ్రేడింగ్ పనులు..**

పొగాకు పంట కోతలు, ఆకు కట్టుడు, బ్యార్లస్లలో ఊడుకించే ప్రక్రియతోపాటు, గ్రేడింగ్ పనులు సైతం చేస్తుంటారు. ఈ గ్రేడింగ్ పనులు నెల రోజులు ముమ్మరంగా సాగుతున్నాయి. పంట ఆకు కోతలు ముగిసిన తర్వాత కూలీలు నీడపట్టున కూర్చొని చేసే పొగాకు గ్రేడింగ్ పనులపై మక్కువ చూపిస్తారు. పొగాకు బ్యారన్ల దగ్గర, పంట పొలాల సమీపంలోనే సాగు చేసే రైతులు పొగాకు గ్రేడింగ్ పనులు చేసేందుకు తాటియాకులతో పందిళ్లను ఏర్పాటు చేస్తారు. ఇంకొంత మంది రైతులు డేరాలు, బరకాలతో వీటిని ఏర్పాటు చేస్తారు. ఈ పందిళ్ల కింద కూలీలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ కూలీలు గ్రేడింగ్ పనులు చేస్తూ ఉపాధి పొందుతారు. ఈ పనుల ద్వారా దాదాపు రెండు వేల మంది కూలీలకు ఉపాధి దొరకుతుంది.

**గిట్టుబాటవుతున్న కూలి..**

పొగాకు గ్రేడింగ్ పనుల వల్ల నీడ పట్టున ఉపాధి పొందుతున్న కూలీలకు ఒక రోజుకు నాలుగు నుంచి ఐదు గంటల పనిచొప్పున రూ.300 నుంచి రూ.450 వరకు కూలి అందుతుంది. ఈ కూలీ వేతనం సరిపడ లేకపోయినప్పటికీ నీడ పట్టున పనులు చేసే అవకాశం ఉండటంతో ఈ పనులు చేసేందుకు కూలీలు ముందుకు వస్తున్నారు. ఈ పనులు చేసేవారంతా మహిళలే కావడంతో వారికి చేతినిండ పనిదొరికట్టింది. ఎండకాలంలో ఆరంభం నుంచి జూన్ రెండోవ వారం దాకా ఈ పనులు సాగుతుంటాయి. దీంతో కూలీలకు దాదాపు రెండు నుంచి మూడు నెలలపాటు చల్లని ఉపాధి దొరకుతుందని కూలీలు చెప్పారు. కొంతమంది రైతులు కూలీ గిట్టుబాటు అయ్యే విధంగా వేతనాలు ఇస్తుంటారని, ఏదైనా చల్లనీ నీడలో పనులు చేయడంతో అధిక ఎండల బాధ లేకుండా పోతుందని కూలీలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పొగాకు పంట సాగు చేయడం వల్ల కూలీలకు నీడతో పాటు కూలీలకు ఉపాధి దొరుకుతుంది. ఈ పనుల వల్ల కూలీలకు ప్రతి రోజు కూలీ దొరుకుతుండగా, ఎండ బాధ లేకుండా నీడలోనే పనులు చేసుకునే సౌలభ్యం ఉండటంతో ఆసక్తి చూపుతున్నారు. సాధారణంగా మండు వేసవిలో కూలీ పనులు ఆశించిన స్థాయిలో దొరకవు, కాగా పొగాకు గ్రేడింగ్ పనులు ముగిసే దాకా ఇళ్లవద్దే ఉపాధి కల్పిస్తోంది. అయితే పొగాకు ఆకుల ఘాటు వల్ల కొంతమేర ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉంటాయని, కానీ ఈ పని చేసే అలవాటు ఉన్నవాళ్లకు ఏలాంటి సమస్యలు ఉండవని పలువురు కూలీలు చెబుతున్నారు. దీంతో అధిక డిమాండ్ నెలకొంది.

**కూలీలు ఆసక్తిగా వస్తున్నారు..**



పొగాకు గ్రేడింగ్ పనులు కొద్ది నెలలు జరుగుతున్నాయి. ఈ పనులు చేసేందుకు అశ్వారావుపేట, ఊట్లపల్లి, ఏపీలోని జీలుగుమిల్లి మండలం దర్బగూడెం నుంచి కూలీలు వస్తుంటారు. వేసవిలో తాటియాకుల పందిరి కింద పొగాకు గ్రేడింగ్ పనులు చేస్తారు. చల్లని నీడ కింద పనులు కావడంతో కూలీలు ఈ పనులు చేసేందుకు ముందుకు వస్తుంటారు. దీంతో రైతులకు కూలీల ఇబ్బందులు ఉండవు.

– కోదూరి రాము, పొగాకు రైతు, ఊట్లపల్లి

## జీలుగు విత్తనాలు పంపిణీ



రైతులకు జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సోమవారం భద్రాచలం మండల వ్యవసాయ అధికారి అనిల్ రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక జీలుగ బస్తా 30 కిలోలు ఉంటుందని, మూడు ఏకరాలకు సరిపోతుందని అన్నారు. దీని విలువ రూ.2790 ప్రభుత్వం రాయితీపై రూ.1116కే అందిస్తుందని ఆయన తెలిపారు. పచ్చిరొట్ట వాడడం ద్వారా భూసారం పెరగడమే కాకుండా నేలలో సూక్ష్మ జీవుల అభివృద్ధి చెందుతుందని, నేల గుల్లబారి పంటకు బలమైన వేరు వ్యవస్థ ఏర్పడి అధిక దిగుబడులు వస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జ్యోతి, రెవెన్యూ డీటీ మణిధర్, ఆగ్రోస్ షాపు యజయాని పవన్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## లోఓల్టేజీ సమస్యను పరిష్కరించండి



ఏజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

**మణుగూరురూరల్:** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని సింగరేణి కార్మికులు నివాసముంటున్న కాలనీ ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఏరియా ఏజీఎం నర్సిరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ నాగెల్లి మాట్లాడుతూ... పీవీకాలనీ, బాంబేకాలనీల్లో లో–ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, తద్వారా కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే లోఓల్టేజ్ వల్ల ఇంట్లోని విలువైన ఎలక్ట్రికల్ గృహోపకరణాలు పాడైపోతున్నాయని తెలిపారు. ప్రధానంగా రాత్రి వేళల్లో విధులు నిర్వహించి ఇంటికి వచ్చినప్పుడు విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో సరిగా నిద్రలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో లోఓల్టేజ్ సమస్య ఏర్పడకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్‌కుమార్, ఎర్రపు వినయ్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, శ్రీనివాస్, రమేష్, లీల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని ఆందోళన

**బూర్గంపాడు:** ఐటీసీ పీఎస్‌పీడీలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఐటీసీ అడ్మిన్ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొనె రామారావు, యారం పిచ్చిరెడ్డిలు మాట్లాడుతు ఇన్ టైమ్ అగ్రిమెంట్ చేస్తామని చెప్పిన ప్రస్తుత గుర్తింపు సంఘం వేతన ఒప్పంద కాలం రెండు సంవత్సరాలు దాటిన అగ్రిమెంట్‌లో రాసుకున్న డిమాండ్లను ఇప్పటికీ పరిష్కరించలేదన్నారు. వేతన అగ్రిమెంట్‌లో కార్మిక సంక్షేమం కోసం రాసుకున్న డిమాండ్ల పరిష్కారంలో గుర్తింపు కార్మికసంఘం పూర్తిగా విఫలమైందన్నారు. ఆందోళన అనంతరం 30 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యాజమాన్యానికి అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## సిటీస్టైల్ జిమ్‌కు చాంపియన్ షిప్



ఖమ్మంలో జరిగిన బెంచ్ ప్రెస్ పోటీల్లో పథకాలు సాధించిన క్రీడాకారులు

**భద్రాచలంఅర్బన్:** ఆదివారం ఖమ్మంలో జరిగిన బెంచ్ ప్రెస్ పోటీలలో భద్రాచలం సిటీ స్టైల్ జమ్ముకు మాస్టర్ టీం చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మాస్టర్స్ 1లోని 74 కేజీల విభాగంలో కోమండ్ల వేణుకి బంగారు పతకం, 94 కేజీల విభాగంలో గుగులోతు శోభన్ నాయక్‌కు కాంస్య పతకం, 105 కేజీల విభాగంలో నాగరాజుకు బంగారు పథకం లభించినట్లు పేర్కొన్నారు. మాస్టర్ 2లో 74 కేజీల విభాగంలో మహంతి వెంకటకృష్ణ బంగారు పతకం, 74 కేజీల విభాగంలో పి.రామకృష్ణకు కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు మాట్లాడుతూ.. భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జీవీ రామిరెడ్డి ఇచ్చిన కఠోర శిక్షణతో పతకాలు సాధ్యమైనట్లు తెలిపారు. పథకాల పొందిన క్రీడాకారులను, పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, గ్రీన్ భద్రాద్రి టీం సభ్యులు, వివిధ రకాల స్వచ్ఛంద సంస్థల సభ్యుల వారు అభినందించారు.

### 'ఏకలవ్య' పరీక్షలో ప్రతిభ

**గుండాల:** మండల కేంద్రంలోని ప్రగతి విద్యాలయం విద్యార్థులు ఏకలవ్య స్కూల్ ప్రవేశపరీక్షలో సత్తాచాటారు. ఈ సందర్భంగా సీటు సాధించిన విద్యార్థిని శ్రీరంగం లక్ష్మీప్రసన్న తదితరులను ఎంపీపీ ముక్తి సత్యం, పాఠశాల కరస్పాండెంట్ తాటిపల్లి సత్యం సోమవారం అభినందించారు. అలాగే, గురుకులాల్లో 15 మంది విద్యార్థులు సీట్లుసాధించారని కరస్పాండెంట్ తెలిపారు.

### వాహనదారుడికి గాయాలు

**బూర్గంపాడు:** సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ గేట్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిలిస్ట్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జూలురుపాడు మండలం నరసాపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి మోటార్ సైకిల్‌పై భద్రాచలం వస్తుండగా బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో నాగిరెడ్డికి గాయాలయ్యాయి. నాగిరెడ్డిని స్థానికులు భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

### సీసీ కెమెరాలు అందజేత

**ములకలపల్లి:** ములకలపల్లి ఉమాపృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి రాజుపేటకు చెందిన వల్లెపు మహేశ్, వెంకటరమణ దంపతులు సీసీ కెమెరాలను విరాళంగా అందించారు. మహేశ్ కొడుకు సూరిబాబు జన్మదినం సందర్భంగా రూ.30 వేల విలువగల కెమెరాలను సోమవారం ఆలయ అర్చకులు విస్సావజ్జుల సురేశ్ శర్మకు అందజేశారు.

### మసీద్ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక

**భద్రాచలంఅర్బన్:** పట్టణ పరిధిలోని అశోక్ నగర్ కాలనీలో ఉన్న మసీద్ ఏ మహమ్మదీయ అహ్లెహదీస్ వద్ద భద్రాచలం అహ్లెహదీస్ పట్టణ శాఖ ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా అబ్దుల్ ఖయ్యూమ్, కార్యదర్శిగా అబ్దుల్ రహీమ్, కోశాధికారిగా షేఖ్ ఆసిఫ్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక జిల్లా జామీయత్ అహ్లెహదీస్ కమిటీ పర్యవేక్షణలో జరిగింది. కార్యక్రమంలో జిల్లా కమిటీ బాధ్యులు అబ్దుల్ ఖుద్దుస్, యాహ్యా ఖాన్, సయ్యద్ ఆసిఫ్,ఇస్మాయిల్, గౌస్ పాషా, సోహేల్ తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు వినతి

**ములకలపల్లి:** కుల బహిష్కరణ, గ్రామస్తుల దాడి విషయంలో చాపరాలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన గద్దల బ్లెసీనా, రాజు దంపతులు కలెక్టర్ ప్రియాంక అలకు వినతిపత్రం అందజేశారు. సోమవారం కలెక్టర్‌ను కలిపి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠకు చందా ఇవ్వలేదని రెండు నెలల క్రితం కుల బహిష్కరణ చేశారని, ఇటీవల తమ కుటుంబీకులు చనిపోతే చూసేందుకు వెళ్లిన తమపై దాడికి చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కక్షకట్టి రివర్స్ కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఇరుపక్షాలు రాజీపడాలని ఒత్తిడి తెస్తున్నారని, న్యాయం చేయాలని వినతిపత్రంలో వారు కోరారు.

## క్యాంప్ ఆఫీసా.. పార్టీ కార్యాలయమా?



అశ్వారావుపేటరూరల్: తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా

**అశ్వారావుపేటరూరల్:** ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసును, కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పార్టీ ఆఫీసుగా మార్చేశారని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రింగ్ రోడ్ సెంటర్లోని తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా పూలమాల వేసి, అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అలాగే స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జెండాను ఎగుర వేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రభుత్వానికి చెందిన క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యే జెండా ఎగర వేయకపోవడాన్ని చూస్తే అశ్వారావుపేట నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఉన్నట్టా.. లేనట్టా..? అని ప్రశ్నించారు. అమలు కానీ హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నామమాత్రంగా చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, దిశ కమిటీ సభ్యులు నారం రాజశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, సత్యవరపు సంపూర్ణ, గుడవర్తి వెంకటేశ్వరరావు, జె.శ్రీరామమూర్తి, మోటూరి మోహన్ పాల్గొన్నారు.

**దమ్మపేట:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాధితులకు, బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పండ్లు, బ్రెడ్డు ప్యాకెట్లను సోమవారం పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలసి దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధితులను పరామర్శించి, వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు.

## 'డబుల్' ఇళ్లు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కనకయ్య

**ములకలపల్లి:** అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే పూర్తి చేసి, లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు స్లాబ్‌లెవల్లో ఆగిపోయాయని అన్నారు. ఏళ్లుగడుస్తున్నా, నేటికి పూర్తికాలేదని విమర్శించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల హామీలో భాగంగా ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపట్ల దృష్టి సారించాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు ఊకంటి రవికుమార్, గౌరి నాగేశ్వరరావు, పొడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, సోయం వీరస్వామి, నిమ్మల మధు, గోపగాని లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో విత్తనాలు అందించాలి

**బూర్గంపాడు:** రైతులకు సకాలంలో విత్తనాలను, ఎరువులను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు ముద్దా బిక్షం డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలసి సోమవారం బూర్గంపాడు తహసీల్దార్ ముజాహిద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ సీజన్ ఆరంభమవుతున్న ప్రస్తుత తరుణంలో రైతులకు అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతులకు బ్యాంకర్లు సకాలంలో రుణాలు అందించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలన్నారు. రుణమాఫీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు కొత్త రుణాలను అందించాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టి రాయితీపై రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లను రాయితీపై అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వై.సతీష్, వెంకటేశ్వర్లు, తిరుపతిరావు, కారం ఆదినారాయణ, కె.మహేష్, సతీష్, సొడె రాజు తదితరులు పాల్గొన్నారు.

## అనాథకు ఆశ్రయం



సోమయ్యను వృద్ధాశ్రమానికి తీసుకుని వెళ్తున్న డిపో స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం ఆర్టీసీ డిపో స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావు ఓ వ్యక్తిని సరోజినిదేవి వృద్ధాశ్రమంలో చేర్పించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

గడిచిన రెండు రోజులుగా భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ లో ఓ వ్యక్తి ఉంటున్నట్లుగా గమనించిన అల్లం నాగేశ్వరరావు అతని వద్దకు వెళ్లి వివరాలు అడిగే ప్రయత్నం చేశాడు. సదరు వ్యక్తి చింతలపూడి గ్రామానికి చెందిన సోమయ్య, అతనికి ఎవరూ లేనట్లుగా తెలిసింది. వెంటనే నాగేశ్వరరావు సరోజినీ దేవి వృద్ధాశ్రమానికి సమాచారం అందించి అక్కడ చేర్పించాడు. ఇదే విధంగా గతంలో అల్లం నాగేశ్వరరావు ముగ్గురు అనాథలను ఇదే వృద్ధాశ్రమంలో చేర్పించారు.

## ఏమరపాటుగా ఉంటే ప్రమాదమే..



ధాన్యం బస్తాలపై కుర్చొని ప్రయాణిస్తున్న కూలీలు

**అశ్వారావుపేటరూరల్:** ధాన్యం బస్తాల లోడుతో వస్తున్న ఓ ట్రాక్టరుపై రైతు కూలీలు ప్రయాణిస్తున్నారు. కాగా ఈ ప్రయాణం ప్రమాదాలకు దారి తీసేలా ఉంది. మండలంలోని ఊట్లపల్లి వైపు నుంచి అశ్వారావుపేటకు ఓ రైతుకు చెందిన ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌పై తరలిస్తుండగా, ఒకదానిపై మరొకటి పేర్చి లోడు చేసిన వాటిపై కొంతమంది రైతు కూలీలు కుర్చొని వస్తున్నారు. బస్తాల లోడును కనీసం తాళ్లతో కుడా కట్టలేదు. దీంతో ఆవి జారి కింద పడిన లేక, కాస్త ఏమరుపాటుగా ఉన్న ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. ఈ దృశ్యాన్ని 'సాక్షి'కెమెరాలో క్లిక్ మనిపించింది.

## ప్రారంభమైన శిర్రాజు జాతర



శిర్రాజు జాతరలోని ఎదుర్కోలు తంతు..

**చర్లరూరల్:** ఇరప వంశం వారి ఇలవేల్పు శిర్రాజు, బాలరాజుల జాతర అత్యంత ఘనంగా సోమవారం కొయ్యూరు గ్రామంలో ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ఎన్నో ఏళ్లుగా ఈ జాతరను చేసుకుంటూవస్తున్నారు. సోమవారం గుడినిండడం, అలంకరణలు, ఆటపాటలతో సంబరాలు చేసుకున్నారు. సాకొండ నుంచి ఇలవేల్పు శక్తులను తీసుకొచ్చి దేవత చెలిమ వద్ద పంచామృతాలతో అభిషేకం చేశారు. మధ్యలో ఎదుర్కొన్నారు. ఈ కార్యక్రమాలను భారీ భక్త జన సందోహం నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం రాత్రి చిన్న పండుగ నిర్వహించారు.